

జయప్రదం చేయాలి

వచ్చేనెల 7న నిర్వహించే మాదిగల మహా సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు.

10లో▸



'సమీకృతం'.. అసంపూర్ణం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి.

10లో▸



ఆక్రమణల చెర వీడాలి

చెరువు ఆక్రమణల చెర వీడాలని మానబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

10లో▸

న్యూస్‌రీల్

గ్రామాల్లో ఫార్మా ప్లాట్ల జాబితా ప్రదర్శన



తాడిపర్తి పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించిన జాబితా

యాచారం: ఫార్మాసిటీకి భూములు సేకరించిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులకు అందజేసిన ప్లాట్ల జాబితాను ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రకటించారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చారు. కందుకూరు మండలం మీరాఖాన్‌పేటలోని 620 ఎకరాల్లో టీజీఐఐసీ మెగా వెంచర్ ఏర్పాటు చేసింది. ఆ వెంచర్‌లోనే ప్లాట్లు ఇవ్వడం కోసం మూడేళ్ల క్రితం అర్హులైన రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఫార్మాలో భూములు కోల్పోయిన వారికే సర్టిఫికెట్లు వచ్చాయా.. లేదా నకిలీలకు వచ్చాయా.. అనే వివరాలు తెలుసుకోవడం కోసం రెవెన్యూ అధికారులు ఆ నాలుగు గ్రామాల్లో సర్టిఫికెట్ల జాబితాను ప్రదర్శించారు. త్వరలో సర్టిఫికెట్లు ఇచ్చిన రైతులకు స్థలాలు చూపించడంతో పాటు ఆ నంబర్లేసి రిజిస్ట్రేషన్లు చేస్తారు.

'ఫ్యూచర్' పరిహారంపై అభిప్రాయసేకరణ



రైతులతో సమావేశమైన ఆర్డీఓ

కందుకూరు: ఫ్యూచర్ సిటీ వరకు వంద మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న రహదారిలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని రాచులూరు రెవెన్యూలోని రైతులతో శుక్రవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కోల్పోతున్న భూములకు ఎంత పరిహారం ఇవ్వాలని రైతుల అభిప్రాయం కోరగా వారు ఎకరాకు రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉర్సును శాంతియుతంగా నిర్వహించాలి

కొత్తూరు: త్వరలో జరగనున్న జేపీదర్గా ఉర్సు ఉత్సవాలను శాంతియూతంగా నిర్వహించడానికి స్థానికులు, మైనార్టీ నాయకులు పోలీసులకు సహకరించాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ కోరారు. ఇందులో భాగంగా ఆయన శుక్రవారం దర్గాను సందర్శించి స్థానికులు, వక్ఫ్ బోర్డు అధికారులతో మాట్లాడారు. ఉర్సు నిర్వాహణలో అనుసరించాల్సిన పద్ధతులపై స్థానికులు, పోలీసులకు పలు సలహాలు, సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తూరు సీఐ నర్సింహారావు, ఎస్‌ఐలు శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు భూములు ఇచ్చేది లేదు

తేల్చిచెప్పిన కొంగరకలాన్ రైతులు



గ్రామసభకు హాజరైన రైతులు

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రీన్‌ఫీల్డ్ కోసం ఏర్పాటు చేయబోతున్న రేడియల్ రోడ్డుకు తమ భూములు ఇవ్వబోమని కొంగరకలాన్ రైతులు స్పష్టం చేశారు. ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు రోడ్డు వేయడానికి భూసేకరణ నిమిత్తం శుక్రవారం ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, భూ సేకరణ అధికారులు విజయ్‌కుమార్, తారకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే కలెక్టరేట్ నిర్మాణం కోసం, ఔటర్ రింగ్‌రోడ్డు కోసం భూములు సేకరించి తక్కువ పరిహారం ఇచ్చారని రైతులు వాపోయారు. ఇప్పుడు ఏర్పాటు చేయబోయే రోడ్డుకు ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. పట్టా భూముల జోలికి వస్తే ప్రాణాలు తీసుకోవడానికైనా వెనకడుగు వేసేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్‌ఐ పుష్పలత, కొంగరకలాన్ వాసులు, రైతులు పాల్గొన్నారు.

వైకుంఠ వైభవం



పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి బారులు తీరిన భక్తులు





చేవెళ్ల: శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం శుక్రవారం వేకువజాము నుంచే క్యూ కట్టారు. ఆయా ఆలయాలకు బారులు తీరారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



మొయినాబాద్‌రూరల్: కనకమామిడి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయంలో చేతులు పైకెత్తి దండం పెడుతున్న భక్తులు

నిబంధనలు ముద్దు.. నిర్లక్ష్యం వద్దు

ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు



షాద్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మృత్యువాత పడుతున్న ప్రయాణికులు

- ఈ నెల 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు

షాద్‌నగర్: అతివేగం.. నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నాయి.. ఎంతోమందిని ఆస్పత్రులపాలు చేస్తున్నాయి.. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అయినా వాహనదారుల్లో కనువిప్పు కలగడం లేదు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా లేకపోవడంతో ప్రమాదాలు పెరుగతున్నాయి. రోడ్డు నియమాలు పాటించకపోవడం, ఓవర్‌స్పీడ్, మైనర్ల డ్రైవింగ్ ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి.

ఆగని ప్రమాదాలు

గత ఏడాదిలో జిల్లాలో 1,394 ప్రమాదాల్లో 430 మంది మృత్యువాత పడ్డారు. మూడేళ్ల కాలంలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే.. 2021లో 996 ప్రమాదాల్లో 340 మంది, 2022లో 971 ప్రమాదాల్లో 260 మంది, 2023లో 997 ప్రమాదాల్లో 354 మంది మృత్యువాత పడ్డారు. ప్రతి ఏడాది మృతుల సంఖ్య పెరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

నివారణపై అవగాహన

ప్రమాదాలు నివారణకు ప్రభుత్వం ఏటా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోంది. రోడ్డు నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ట్రాఫిక్, రవాణాశాఖ, ఆర్టీసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించేందుకు ఈ నెల 1 నుంచి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోంది. గ్రామాలు, పట్టణాలు ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

జరిమానాల విధింపు

మద్యం తాగి వాహనాలు నడిపించినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా, పరిమితి సంఖ్యకు మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకున్నా, హెల్మెట్ ధరించకున్నా, సీటు బెల్టు లేకున్నా చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు.

ఇవీ నిబంధనలు

- ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలి.
- ఎవరైనా వాహనం నడిపించాలంటే విధిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి.
- ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ చేయడం నేరం.
- మద్యం తాగి వాహనాలు నడిపించొద్దు, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు.
- మలుపుల వద్ద వేగాన్ని తగ్గించాలి
- వాహనాలు నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడొద్దు.
- రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎదుటి వాహనాలకు దూరంగా ఉండాలి.
- ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు పెట్టుకోవాలి.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



రోడ్డు భద్రత అందరి బాధ్యత. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. తద్వార ప్రాణాలు నివారించవచ్చు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలి. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు.

– వాసు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, షాద్‌నగర్

ప్రమాదాలను నివారిద్దాం

షాద్‌నగర్‌రూరల్: వాహనదారులు నియమాలు పాటించి ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని సైబరాబాద్ రోడ్డు సేఫ్టీ డీసీపీ ఎల్‌సీ నాయక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ట్యాక్సీ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌సీ నాయక్ మాట్లాడుతూ.. రెప్ప పాటులో జరిగే పొరపాటు ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు. డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలు నడపాలని సూచించారు. మద్యం తాగి నడపరాదన్నారు. ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం మాట్లాడుతూ.. మైనర్‌లకు వాహనాలు ఇవ్వడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనాలను నడిపేవారు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ గురువయ్య, ఎంవీఐ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

గీజర్ సలసల.. మీటర్ గిరగిర!

- చలిలోనూ హీటెక్కుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఉదయం 7.30 గంటల సమయంలో డిమాండ్
- ప్రతిరోజూ గరిష్టంగా 60 ఎంయూల నమోదు

గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా..

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
03	3,243	60.24
04	3,077	58.14
05	2,678	54.26
06	3,146	58.80
07	3,271	60.07
08	3,242	60.01
09	3,250	59.06

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులకు మంచు తోడవుతోంది. చలికి జనం గజగజ వణికిపోతుంటే.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రం హీటెక్కుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులకు కార్యాలయాలకు తయారయ్యే సమయం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్యలో డిమాండ్ అధికంగా నమోదవుతోంది. స్నానానికి వేడి నీళ్ల కోసం ప్రతి ఇంట్లో గీజర్ వినియోగం తప్పని సరిగా మారింది. గీజర్‌తో బకెట్‌లోని నీళ్లు సలసలా కాగుతుంటే.. విద్యుత్ మీటర్ గిరగిరా తిరుగుతోంది. సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో ఒత్తిడికి తట్టుకోలేక కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలలో నమోదు కావాల్సిన రోజు సగటు గరిష్ట (60 మిలియన్ యూనిట్లు) డిమాండ్ సంక్రాంతికి ముందే నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వచ్చే వేసవిలో ఎలా ఉండబోతోందో. రోజు సగటు డిమాండ్ వంద మిలియన్ యూనిట్లకు చేరుకునే అవకాశం లేకపోలేదని డిస్కం అంచనా వేస్తోంది. ఆ మేరకు లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతోంది.

అసంపూర్తి 'విస్తరణ'



అబ్దుల్లాపూర్‌మెట్ గండిమైసమ్మ దేవాలయం వద్ద ఇరుగ్గా ఉన్న రహదారి

- ఇరుగ్గా మారిన విజయవాడ జాతీయ రహదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- సంక్రాంతికి ఏపీ వెళ్లే వాహనాలకు పాట్లే..

అబ్దుల్లాపూర్‌మెట్: సంక్రాంతి వచ్చిందంటే విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వారి సంఖ్య ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పండుగకు రెండు, మూడు రోజుల ముందు నుంచే వాహనాల రద్దీ ఉంటుంది. జాతీయ రహదారిపై పెరుగుతున్న రద్దీని అధిగమించేందుకు విస్తరణ చేపట్టారు. అయితే పలు చోట్ల అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం చేపట్టడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు 24 కిలోమీటర్ల మేర విజయవాడ జాతీయ రహదారికి రూ.600 కోట్లతో ఇరువైపులా విస్తరణ కొనసాగుతోంది. వనస్థలిపురం నుంచి దండు మల్కాపూర్ వరకు పనులు ప్రారంభంగా కాగా నల్లగొండ-రంగారెడ్డి సరిహద్దుతో పాటు పెద్దఅంబర్‌పేటలోని లక్ష్మారెడ్డిపాలెం, కోహెడ కూడలిలో చేపట్టిన వంతెనల నిర్మాణాలు పూర్తయి రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఎల్‌బీనగర్ నగర్ నుంచి విజయవాడ వైపునకు వెళ్లే మార్గంలో చాలా చోట్ల రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


ఇబ్బందులు వచ్చే ప్రాంతాలు

లక్ష్మారెడ్డిపాలెంలోని హ నుమాన్ దేవాలయం వద్ద, అబ్దుల్లాపూర్‌మెట్ గండిమైసమ్మ దేవాలయం వద్ద రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ఇరుగ్గా మారింది. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి, మమూరి కాంట, ఇనాంగూడ చౌరస్తా, కొత్తగూడెంలోని పోచంపల్లి ఎక్స్‌రోడ్డు (పండ్ల మార్కెట్) తదితర ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో రోడ్డు ఇరుగ్గా మారి వాహనాల సంఖ్య పెరిగిన సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ మార్గం నుంచి ప్రయాణించే వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోకుండా జాగ్రత్తలు తీసుకుంటే మేలు.



ఇనాంగూడ వద్ద అసంపూర్తిగా రోడ్డు విస్తరణ

ప్రజల భాగస్వామ్యంతోనే చెరువుల రక్షణ



కోకాపేట కొత్త చెరువు అభివృద్ధి నమూనాను ఆవిష్కరించిన హెచ్‌ఎండీఏ కమిషనర్

మణికొండ: చెరువుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీలోని కోకాపేట కొత్త చెరువును ఫ్రీడం వంట నూనెలసంస్థ (జీఈఎఫ్ ఇండియా) దత్తత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 3,268 చెరువుల్లో 700 చెరువుల అభివృద్ధికి నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. మరో 300 చెరువులకు త్వరలోనే ఇస్తామన్నారు. నగర శివారులోని 26 చెరువులను పలు సంస్థలకు దత్తత ఇచ్చి వారి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోకాపేట కొత్త చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, పచ్చదనం, పిల్లలు ఆడుకునే వస్తువులు, కూర్చుని సేద తీరేందుకు పార్కులను ఫ్రీడం ఆయిల్ సంస్థ అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ చిన్నచెరువును దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (ఫ్రీడం ఆయిల్) సంస్థ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ కోట శ్రీవత్స తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు సకాలంలో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి సందర్భంగా నెలకొన్న రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు సకాలంలో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశీయ ప్రయాణికులు తమ ప్రయాణ సమయానికి కనీసం 2 గంటలు, అంతర్జాతీయ ప్రయాణికులు 3 గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని సూచించారు. ప్రయాణానికి అవసరమైన డాక్యుమెంట్‌లను జాగ్రత్తపర్చుకోవాలని, తనిఖీల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా డీజీ యాత్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. సంక్రాంతి దృష్ట్యా మరింత రద్దీ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

చిలుకూరుకు భక్తుల తాకిడి



ఆలయంలో భక్తుల సందడి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ ఉత్తర ద్వారం లేకున్నా భక్తులు మాత్రం వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని దర్శించుకోవాలని చిలుకూరుకు వచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రద్దీ విపరీతంగా కొనసాగింది. దీంతో మధ్యాహ్నం వరకు ప్రదక్షిణలు నిలిపివేశారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు వైకుంఠ ఏకాదశి విశిష్టతను తెలియజేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. అనంతరం శివాలయంలో పూజలు చేశారు.

ఆటోను ఢీ కొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్‌రూరల్: ఆటోను కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుశీల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం చౌడూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ గ్రామంలో నివసిస్తున్నాడు. ప్రతిరోజు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ నుంచి షాద్‌నగర్‌కు ప్యాసింజర్ ఆటో నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం లక్ష్మణ్ తన ఆటోలో బాలానగర్‌లో ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకొని షాద్‌నగర్ వస్తున్నాడు. జడ్చర్ల నుంచి షాద్‌నగర్ వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి ముందు వెళుతున్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో అదుపు తప్పి పల్టీలు కొడుతూ రోడ్డు కిందకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బాలానగర్‌కు చెందిన కిశోర్, ఆటో డ్రైవర్ లక్ష్మణ్ తలకు తీవ్ర గాయాలు కాగా కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సుశీల తెలిపారు.

'సమీకృతం' అసంపూర్ణం

కూరగాయలు.. పూలు.. పండ్లు.. మాంసం ఇలా విక్రయాలన్నీ ఒకే చోట ఉండేలా.. రోడ్ల పక్కన అమ్మకాలను నివారించేలా గత ప్రభుత్వ హయాంలో సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చాలాచోట్ల పనులు ప్రారంభమైనప్పటికీ నిధులు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. యథావిధిగా రహదారుల పైనే విక్రయాలు కొనసాగుతున్నాయి.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు నిధుల గ్రహణం
- మధ్యలోనే నిలిచిపోయిన నిర్మాణ పనులు
- రోడ్లపైనే క్రయవిక్రయాలు



ఆదిబట్లలో నిలిచిన మోడల్ మార్కెట్ నిర్మాణం పనులు

మో'డల్' మార్కెట్


ఇబ్రహీంపట్నం రూరల్: మోడల్ మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఆదిబట్ల మున్సిపాలిటీలో ఆదర్శంగా నిర్మాణం చేపడతామని టీయూఎఫ్ఐడీసీ నిధులతో మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు రూ.2 కోట్లతో హడావుడిగా పనులు చేపట్టారు. ప్రస్తుతం ఉత్సవ విగ్రహంలా మారింది. మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. అన్ని మార్కెట్లు ఒకే చోటకు తీసుకొచ్చి పట్టణ ప్రజలకు అనువుగా ఉండేలా సమీకృత మార్కెట్ నిర్మించారు. స్లాబులు వేసి వదిలేశారు. మూడేళ్లుగా పనులు చేసినా నయా పైసా రాకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివేశారు.

త్వరగా పనులు చేపట్టాలి



ఆదిబట్లలో మోడల్ మార్కెట్ నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. అధికారులు, కాంట్రాక్టర్లకే విషయం తెలియాలి. ఎందుకు పనులు చేయడం లేదో తెలియడం లేదు. మార్కెట్ నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుంది. అధికారులు చొరవ తీసుకొని పూర్తి చేయాలి.
– పల్లె శ్రీనివాస్‌గౌడ్, ఆదిబట్ల

ప్రారంభించేలా చూస్తాం



ఆదిబట్లలో రోడ్డు పక్క నే పట్టణానికి కొద్ది దూరంలో మోడల్ మార్కెట్ భవన నిర్మా ణం చేపట్టారు. 50 శాతం పనులు పూర్త య్యాయి. బిల్లులు రాక పనులు చేయడం లేద ని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికే కాంట్రాక్టర్లతో మాట్లాడటం జరిగింది. త్వరలో ప్రారంభించేలా చూస్తాం.
– బాలకృష్ణ, కమిషనర్, ఆదిబట్ల

నిధులు లేక నిలిచిపోయి..



అసంపూర్తిగా నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ఆమనగల్లు: నిధులు లేకపోవడంతో పట్టణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన మార్కెట్ పనులు నేటికీ పూర్తికాకపోవడంతో కూరగాయలు, మాంసం విక్రయాలు స్థానిక పట్టణంలోని అంగడి బజార్‌లో రోడ్లపై కొనసాగుతున్నాయి. మార్కెట్ నిర్మాణానికి నాలుగేళ్లక్రితం ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో 2021 నవంబర్ 8న అప్పటి మంత్రులు సబితా రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. ఏడాది అనంతరం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పది నెలల క్రితం పనులను నిలిపివేశారు. కాంట్రాక్టర్ ఇప్పటి వరకు రూ.3.30 కోట్ల పనులు చేపట్టగా ప్రభుత్వం రూ.2.26 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్‌కు రూ.1.04 కోట్ల బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.4.50 కోట్లకు అదనంగా రూ.1.49 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లర్లకే పరిమితం



అర్ధంతరంగా ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. ఫిబ్రవరి 2022లో అప్పటి మంత్రి కేటీఆర్ మార్కెట్ నిర్మాణానికి శిలాఫలాకం వేశారు. రూ.4.50 కోట్లతో నిర్మాణాన్ని చేపట్టుడున్నట్లు ప్రకటించారు. కూరగాయల మార్కెట్‌కు మరో రూ.1.6 కోట్లతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కేవలం కొన్ని షట్టర్ల వరకు కూరగాయల మార్కెట్ నిర్మాణం జరిగింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మాత్రం పిల్లర్లకే పరిమితమైంది. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలోని ప్రధాన రోడ్లపై వ్యాపారులు కూరగాయలను విక్రయిస్తున్న నేపథ్యంలో ఇంటిగ్రేటెట్ మార్కెట్ నిర్మిస్తే సమస్యలు తీరుతాయని భావించారు. చౌరస్తా నుంచి మంచాల రోడ్డులో నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు దుకాణాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఏమైందో ఏమో మార్కెట్ నిర్మాణ పనులు ఆదిలోనే ఆగిపోయాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముందు కొందరు వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకోని కూరగాయలు విక్రయిస్తున్నారు. వీరికి అక్కడ ఎలాంటి సదుపాయాలు లేవు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే తమ షాపులు అందులోకి మార్చుకోవచ్చని ఆశతో ఎదురు చూస్తున్నారు. పాలకులు పట్టించుకోని నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

పూర్తి చేయాలి



చిరువ్యాపారుల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ఆశతో ఎదురు చూస్తున్నాం. నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు పూర్తి చేసి వ్యాపారులకు సౌకర్యం కల్పించాలి. – అశోక్, ఇబ్రహీంపట్నం



నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణం

అర్ధంతరంగా ఆగిపోయి..

కొత్తూరు: మున్సిపాలిటీలో ప్రజలకు కూరగాయలు, చికెన్, మటన్, పూల మార్కెట్లు అన్నీ ఒకేచోట అందుబాటులో ఉండేలా గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం నిధుల లేమితో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో చిరు వ్యాపారులు రోడ్ల పక్కనే కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. కొత్తగా ఏర్పాటైన కొత్తూరు మున్సిపాలిటీలో 2022 జూలైలో అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.2 కోట్లతో అన్ని వసతులతో పనులు చేపట్టేందుకు పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా మార్కెట్ నిర్మాణం పూర్తి కాలేదు.

రోడ్ల పక్కనే విక్రయాలు

సమీకృత మార్కెట్ల నిర్మాణం పూర్తయితే మున్సిపాలిటీ పాలకవర్గం ఆమోదంతో చిరు వ్యాపారులకు షటర్లు కేటాయిస్తారు. అక్కడ అన్ని వసతులతో వ్యాపారం నిర్వహించుకోవడానికి అవకాశం ఉంది. దానికి తోడు ప్రమాదకరంగా రోడ్ల పక్కన వ్యాపారులు చేసే వారికి ప్రయోజనం ఉంటుంది. కూరగాయలు, మటన్, పూల మార్కెట్లు అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా చెత్త సైతం రోడ్లపై పేరుకుపోకుండా ఉంటుందని భావిస్తున్నారు.

యాభై శాతం పూర్తి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు యాభై శాతానికి పైగా పూర్తయ్యాయి. ప్రస్తుతం నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. మార్కెట్ పను లు పూర్తయితే చిరు వ్యాపారులతో పాటు ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. – బాలాజీ, మున్సిపల్ కమిషనర్

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

చేవెళ్ల: జీవితంపై విరక్తి చెందిన ఒంటరి మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇక్కారెడ్డిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సత్తమ్మ(45)ను ఇరవై ఏళ్ల కిత్రం వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. భర్త పదేళ్ల కిత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు పిల్లలు లేకపోవటంతో తల్లిగారి గ్రామమైన ఇక్కారెడ్డిగూడకు వచ్చి ఉంటుంది. ఒంటరి జీవితం కావటంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగింది. కాసేపటికి గమనించిన తల్లి ఏమైందని అడగటంతో పురుగు మందు తాగినట్లు చెప్పగా.. వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి ఉస్మానియా ఆస్పత్రికి మార్చారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్లు నరికినవారిపై కేసుల నమోదు



చరికొండలో నరికిన తాటిచెట్లు

ఆమనగల్లు: కడ్తాల్ మండలం చరికొండలో అనుమతి లేకుండా తాటిచెట్లను నరికిన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ తెలిపారు. చరికొండకు చెందిన శ్రీరాములు, నాగిళ్లకు చెందిన గోపాల్, రాములుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గీత కార్మికుల జీవనోపాధి అయిన తాటిచెట్లను అనుమతిలేకుండా నరికితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోడకు కన్నం పెట్టి సెల్‌ఫోన్ల చోరీ

ఒడిశా దంపతుల అరెస్ట్




సెల్‌ఫోన్లతో పట్టుబడ్డ నిందితులు

పహాడీషరీఫ్: గోడకు కన్నం పెట్టి మొబైల్ దుకాణంలో విలువైన సెల్‌ఫోన్లు చోరీ చేసిన ఒడిశాకు చెందిన దంపతులను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జితేంద్ర జానీ(22), జ్యోతి చత్రియా(19) భార్యాభర్తలు. బతుకు దెరువు నిమిత్తం తుక్కుగూడకు వలస వచ్చి ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో కార్మికులుగా పని చేస్తున్నారు. వచ్చే వేతనం ఖర్చులకు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 8న రాత్రి తుక్కుగూడలోని ఓ మొబైల్ దుకాణానికి కన్నం పెట్టి, లోపలకి వెళ్లి ఎనిమిది సెల్‌ఫోన్లు తస్కరించి పరారయ్యారు. 9న ఉదయం యజమాని షాప్ తెరిచి చూడడంతో గోడకు కన్నం పెట్టి ఉండడంతో పాటు రూ.1,83,492 విలువైన ఫోన్లు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డీఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి సీసీ కెమెరాల ఆధారంగా దంపతులను అరెస్ట్ చేసి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

శ్రీఇందు భూముల క్రయవిక్రయాలు ఆపేయండి

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- 4న కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు ఆదేశం



శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాల

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించి ఎలాంటి క్రయవిక్రయాలు, లావాదేవిలు నిర్వహించవద్దని, నిర్మాణాలు చేపట్టవద్దని శుక్రవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శేరిగూడ, మంగల్‌పల్లిగేట్ ప్రధాన రహదారి పక్కన ఉన్న 221 సర్వే నంబర్‌లో 3.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇందుకు సంబంధించి శ్రీఇందూ యాజమాన్యం తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకుందని మచ్చ మహేందర్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ భూమిని కాపాడకపోవడంతో పాటు ఆక్రమణకు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈఅంశంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం 221 సర్వేనంబర్‌లోని భూమికి సంబంధించిన ఎలాంటి లావాదేవీలు జరపొద్దని, ఫిబ్రవరి 4న కౌంటర్ దాఖలు చేయాలని సంబంధిత రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు మధ్యంతర ఆదేశాలు జారిచేసింది. కాగా ఈ భూమిని 59 జీవో ప్రకారం గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు శ్రీఇందూ కాలేజీ యాజమాన్యం రిజిస్ట్రేషన్ చేసుకుంది.

'మహాప్రదర్శన'ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు: వచ్చేనెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు, వేయి గొంతులు మాదిగల మహా ప్రదర్శన సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ, జిల్లా కో ఆర్డినేటర్ మద్దిలేటి మాదిగ తెలిపారు. తలకొండపల్లిలోని దేవకిగార్డెన్స్‌లో శుక్రవారం సంఘం జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు స్వార్థపరుల కుట్రలకు తలొగ్గి మాదిగల వర్గీకరణ చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరిని తిప్పికొట్టేందుకు, దండోరా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగల మహాప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు రావుగల్ల బాబుమాదిగ, శంకర్‌రావ్ మాదిగ, రవి, చిట్టిబాబు, ప్రశాంత్, రామచంద్రయ్య, కిరణ్, రవి, శ్రీకాంత్, పులికంటి మైసయ్య పాల్గొన్నారు.

ఆక్రమణల చెర వీడాలి



మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

తుర్కయంజాల్: చెరువు ఆక్రమణల చెర వీడాలని మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చెరువును పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 205లో పెద్ద ఎత్తున మట్టిని డంప్ చేయడాన్ని నిరసిస్తూ మూడు నెలల పాటు రాత్రి, పగలు అనే తేడా లేకుండా పోరాటం చేశామని గుర్తుచేశారు. ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులను కాపాడే ప్రయత్నం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. గతంలో హైడ్రా అధికారులను కలిసి చెరువును కాపాడాలని వినతి పత్రం అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు బచ్చిగళ్ల రమేశ్, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటి సభ్యులు బోసుపల్లి ప్రతాప్, కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, రమావత్ కళ్యాణ్ నాయక్, నాయకులు కొంతం యాదిరెడ్డి, బొక్క వంశీధర్‌రెడ్డి, కె.అరుణ్ కుమార్, గుత్త మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.